క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేదు

• ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ

పలమనేరు: ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేదని, కొందరు దళారులు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిని నమ్మరాదని శుక్రవారం పలమనేరు ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిన పక్షంలో సకాలంలో వాటికి మరమ్మతులు చేసి రైతులకు పంపుతున్నామన్నారు. ఏదేని సమస్య లుంటే రైతులు నేరుగా తన కార్యాలయంలో సంప్రదించాలని, దళారులను ఆశ్రయించి మోసపోరాదని విజ్ఞప్తి చేశారు.

లద్దిగంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చౌడేపల్లె: ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలోని లద్దిగంలో అంబేడ్కర్ సేవా సంఘం నాయకులు విశ్రాంత ఐఏఎస్ అధికారి మునివెంకటప్ప జ్ఞాపకార్థం శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మంచి నీటితోపాటు మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు మునస్వామి, మణి, చెంగన్న, వెంకట్రమణ, సైదాన్ సాబ్, శంకర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సదుమమ్మకు ప్రత్యేక పూజలు

సదుం: మండలంలో ఎర్రాతివారిపల్లెలోని సదుమమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు.

చిన్నారులకు అండగా భవిత కేంద్రాలు



భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జయప్రకాష్ నాయుడు

బైరెడ్డిపల్లి: మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులకు, వారి తల్లులకు మనోధైర్యాన్ని నింపుతూ భవిత కేంద్రాలు వారికి అండగా నిలుస్తున్నాయని సమగ్రశిక్ష ఐఈ కో–ఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు అన్నారు. స్థానిక భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ నిర్మలకుమారి, సుభాషిణి పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 13 మంది గైర్హాజరు

పుంగనూరు: పట్టణంలో శుక్రవారం పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 13మంది గైర్హాజరయ్యాయని ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్న శెట్టి తెలిపారు. మొత్తం 8 పరీక్ష కేంద్రాలలో 1,336 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1323 మంది మాత్రమే హాజరయ్యాయని చెప్పారు.

పలమనేరులో 16మంది..

పలమనేరు: పట్టణంలో శుక్రవారం పదోతరగతి ఇంగ్లిష్ పరీక్షకు 1377మందికిగాను 1361మంది హాజరయ్యారని, 16మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ లీలాకుమారి తెలిపారు.

నూతన కార్యవర్గం



పలమనేరు: పలమమేరు రెవెన్యూ డివిజన్ ఏపీ ఆర్‌ఎస్‌ఏ(ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మాధవరాజు, ఉపాధ్యక్షులుగా యోగానంద్, మోహన్‌రెడ్డి, తహసీనా, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కుమార్, రాజసింహ, కుమారమ్మ, కోశాధికారిగా రమేష్, కార్యవర్గ సభ్యులుగా దేవేంద్ర, సరిత, రాకేష్ ఎంపికయ్యారని తెలియజేశారు.

రైతు బజార్ తనిఖీ

పలమనేరు: పట్టణంలో ఇటీవల మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను వ్యాపారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి కోరారు. స్థానిక మార్కెటింగ్, మున్సిపల్ అధికారులతో కలసి శుక్రవారం ఆయన రైతుబజార్‌ను తనిఖీ చేశారు. ఇక్కడ వ్యాపారులకు అవసరమైన సేవలను అందిస్తామన్నారు. రైతులు తమ వ్యవసాయోత్పత్తులను ఇక్కడ ఎలాంటి కమీషన్లు లేకుండా విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

స్థల కబ్జాకు యత్నం!

• తెలివిగా ఎంక్రోచ్‌మెంట్ ఫీ కట్టి పనులు చేస్తున్న వైనం
• ఆర్‌అండ్‌బీలోని తన అన్న సాయంతో తమ్ముడి ప్లాన్!
• ఆక్రమణలకు కొందరు పచ్చనేతల అండ

పలమనేరు: పట్టణంలో రోజురోజుకూ స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికే మెయిన్ రోడ్లపక్కన అడుగు రూ.10వేలను దాటింది. ఈ లెక్కన ఎకరా రేటు ఏ రేంజ్‌లో ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో స్థానిక గుడియాత్తం రోడ్డులోని యోగా డిజిటల్స్ ఎదురుగా మున్సిపల్ స్కీమ్ బోరు, రాజకాలువ ఉన్న చోట ఉమా మహేష్ అనే వ్యక్తి ఎంక్రోచ్‌మెంట్ ఫీజును మున్సిపల్ అధికారులకు చెల్లించి, అక్కడ తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసుకుంటానంటూ నమ్మబలికి తెలివిగా స్కెచ్ వేశాడు. అక్కడి 300 అడుగుల స్థలంలో ఇనుపరాడ్లు, రేకులతో దుకాణ నిర్మాణానికి పనులు మొదలు పెట్టాడు. క్రమంగా దానిని స్వాధీనం చేసుకుని పక్కా భవనానికి స్కెచ్ వేశాడు. అయితే దీనిపై కొందరు స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది.

వివాదాల స్థలానికి ఎలా అనుమతులిచ్చారో..?

గతంలో అక్కడ మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజల దాహార్తి తీర్చే నిమిత్తం బోరు వేయడానికి వెళ్లగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఆక్షేపించినా అధికారులు బోరు వేశారు. మరోవైపు ఆ స్థలంపై విదేశాల్లో ఉంటున్న లేట్ కృపాకర్ కుటుంబీకుల మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. అసలు రాజకాలువపై అక్రమ నిర్మాణమిది. ఇన్ని ఆటంకాల నడుమ మున్సిపల్ అధికారులు ఎంక్రోచ్‌మెంట్ ఫీజు ఎలా కట్టించుకున్నారు? దీనివెనుక ఎవరున్నారు? అనే విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అక్కడ ఏ నిర్మాణాలు జరిగినా అది ఆర్‌అండ్‌బీదని అడ్డుకునే అధికారులు ఇప్పుడు మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే



గుడియాత్తం రోడ్డులో ఓ వ్యక్తి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

దీనికీ ఒక సమాధానం లభించింది. ఇక్కడ నిర్మాణాలకు పూనుకున్న వ్యక్తి సోదరుడు ఆర్‌అండ్‌బీలో పనిచేస్తుండడంతో గుట్టుచప్పుడు కాకుండా దీనిని కబ్జా చేసేందుకు స్కెచ్ వేశారనే ప్రచారంలోకి వచ్చింది. అలాగే, మరోవైపు టీడీపీకి చెందిన కొందరు నేతలు రూ.2లక్షల వరకు ఈ వ్యవహారంలో డీల్ చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై స్థానిక మున్సిపల్ టీపీఎస్ ఇందిరాను వివరణ కోరగా.. ఆ స్థలం తమ ఆధీనంలోనే ఉందని, తమను ఏమార్చి ఫీజు కట్టించారని తెలిపారు. దీనిపై ఇన్ని అభ్యంతరాలు ఉన్న విషయం తమకు తెలిదని చెప్పారు. సంబంధిత వ్యక్తికి నోటీసు ఇచ్చి వెంటనే ఆ నిర్మాణాలను నిలుపుదల చేయిస్తామన్నారు. అంతేకాకుండా అక్కడున్న ఇతర అక్రమ నిర్మాణాలపై సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హుండీ ఆదాయం రూ.76 వేలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడు నెలలకుగాను రూ.76,265 ఆదాయం సమకూరిందని, ఈ సొమ్మును ఆలయ అభివృద్ధి ఖాతాకు జమ చేస్తామని ఈఓ కమలాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



చంద్రప్ప

కుప్పం: కుప్పం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేసీ చంద్రప్ప, జనరల్ సెక్రటరీగా కొత్తపల్లి ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకట్రమణ, జాయింట్ సెక్రటరీగా అమరనాథ్, కోశాధికారిగా మురుగన్, అదనపు కోశాధికారిగా సుధాకర్, మహిళా కార్యదర్శిగా శైలజశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా అనిల్ కుమార్, లైబ్రేరియన్‌గా పుష్పలతలను ఎన్నుకున్నారు.

భాస్కర్‌రెడ్డికి ఘన నివాళి

సదుం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి 31వ వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం ఎర్రాతివారిపల్లెలో ఆయన చిత్రపటానికి, విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. అలాగే ఆయన సమాధి వద్ద ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి దంపతులు పూజలు చేశారు. ఇంటి వద్ద అన్నదానం చేశారు. పలువురు ఎమ్మెల్యేలను కలిసి సమస్యలను నివేదించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, వ్యవసాయ సలహామండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అభినయ్ రెడ్డి, నిహాంత్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు ఉన్నారు. అలాగే, జోగివారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి వర్ధంతిని ఆయన అభిమానులు, గ్రామస్తులు నిర్వహించారు.



నివాళులు అర్పిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి

నోటీస్ బోర్డు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. చెన్నైకి చెందిన శంకర్‌నేత్రాలయ బృందం వైద్య పరీక్షలు చేస్తుందని, కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న రక్తదాన శిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో ఈనెల 23న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ పి.శివ తెలిపారు. 'రక్తదానం చేయండి–ప్రాణాలను కాపాడండి' నినాదంతో ఈ శిబిరం నిర్వహిస్తామని, ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

• గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయిస్తాం
• జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చెప్పారు. ఈ దిశగా గ్రామాల్లో బోర్లు వేయించి తాగునీటి సమస్యలను తీరుస్తామన్నారు. మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ నడిపేపల్లెలో గ్రామస్తుల అభ్యర్థనపై స్పందించారు. జెడ్పీ నిధులు మంజూరు చేసి శుక్రవారం బోరు డ్రిల్లింగ్ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. బోరులో 2.5 ఇంచీల నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, ఎంపీటీసీలు హరీష్ రెడ్డి, అతా ఉల్లా, వైస్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణ, రెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, సంపంగిరెడ్డి, ఆనంద్, హజ్రత్, మైనారిటీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోరు డ్రిల్లింగ్‌కు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

కుప్పం రూరల్: విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని బాగా చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని స్థానిక ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి వారి ఆకాంక్షలకు తగ్గట్టు రాణించినప్పుడే చదువులకు సార్థకత చేకూరుతుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, క్యాంపస్ సెలెక్షన్లలో ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథరావు, అధ్యాపకులు శ్రీనివాసులు, సుబ్బన్న, రామకృష్ణారావు, సయ్యద్ హుస్సేన్, హేమంత్‌రాయ్, జీవీ రమేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు పొందిన విద్యార్థులు

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ

బైరెడ్డిపల్లి: కమ్మనపల్లె గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం వడదెబ్బ నివారణపై తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, రోజు రోజూ వేసవి ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండలో ప్రయాణించేటప్పుడు తలపై రుమాలు లేదా టోపీ ధరించాలన్నారు. నీళ్లు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ వంటి ద్రావణాలు అధికంగా తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాయిదివ్య, రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి పోతన ఓ దిక్సూచి

పలమనేరు: తెలుగు సాహిత్యానికి పోతన ఓ దిక్సూచి అని డిగ్రీ కాలేజీ తెలుగుశాఖాధిపతి ఈ.వాసు అభివర్ణించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాగవతం–భక్తి, తాత్వికత, సామాజికత అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సు సమన్వయకర్తగా వాసు మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో పోతనకు సహజకవిగా పేరుందని, తెలుగంటే పోతన, పోతనంటే భాగవతంగా మారిందన్నారు. పోతన పాండిత్యాన్ని ఎంత పొగిడినా తక్కువేనన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు మాట్లాడుతూ, తెలుగు సాహిత్యానికి పోతన ఓ వెలుగు దీపిక అన్నారు. తిరుపతి ఓరియంటల్ రీసెర్చ్ కళాశాల ఆచార్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పోతన లాంటి గొప్పకవి తెలుగువానిగా పుట్టడం మనందరి అదృష్టమన్నారు. 15వ శతాబ్దంలో కేవలం రాజుల కోసం కావ్యాలు రాస్తున్న వేళ సామాన్య ప్రజల కోసం కావ్యాలు రాసిన మహోన్నత వ్యక్తి పోతన అని, భాగవతంలో భక్తి, తాత్వికత, వ్యక్తిత్వాలను సృశించిన మహా కవి ఆయనేనని కీర్తించారు. ఆచార్యులు రాజేశ్వరమ్మ (ఎస్వీయూ) మాట్లాడుతూ, పోతన పామరులను సైతం మెప్పించారన్నారు. అలాగే భక్తి మార్గాలకు ఆయన బాట చూపారన్నారు. స్మరణ, కీర్తన, మనోవాక్కాయ కర్మల ద్వారా భగవంతుని సన్నిధికి సులువుగా చేరుకోవచ్చని తన కావ్యాలతో చాటారన్నారు. సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న సమన్వయకర్త వాసు

కౌన్సిల్ సమావేశ నిర్వహణపై నిర్లక్ష్యమెందుకో..?

• ఫిర్యాదు చేసినా పట్టించుకోని కమిషనర్
• మున్సిపల్ కౌన్సిలర్ల మండిపాటు

కుప్పం: నాలుగు నెలలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు విమర్శించారు. శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల నిమిత్తం చర్చించేందుకు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని 15 రోజుల క్రితం కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. చైర్మన్‌గా ఉన్న వ్యక్తి పదవికి, కౌన్సిల్ సభ్యత్వానికి రాజీనామా చేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యల విషయమై అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడం విడ్డూరంగా వుందన్నారు. దీని వల్ల మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాలని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లుగా ఇద్దరు ఉన్నా కౌన్సిల్ సమావేశ నిర్వహణకు అర్హత వుందని, దీనిపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లా..? లేక అధికారుల నిర్లక్ష్యమా..? అని సూటిగా ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ మీట్ నెలలు గడుస్తున్నా నిర్వహించకపోవడం నిబంధనలకు విరుద్ధం కాదా? అని నిలదీశారు. ఇకనైనా జాప్యం చేయకుండా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మోహన్‌రామ్, మునిరాజ్, విజయ్, రాజ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

గరుడ వాహనంపై విహారం



గరుడ వాహనంపై కొలువు తీరిన స్వామివారు

గుడుపల్లె: మండలంలో కనమనపల్లెలోని శ్రీనివాస స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత స్వామి వారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనం కొలువు తీర్చారు. అనంతరం పుర వీధులలో మంగళవాయిద్యాల నడుమ గరుడ వాహనంపై భక్తుల గోవింద నామ స్మరణ నడుమ విహరించారు. రాత్రి పద్మావతి శ్రీనివాసస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

పలమనేరు: స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ప్రపంచ అటవీశాఖ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, మానవాళి మనుగడ అడవుల సంరక్షణపై ఆధారపడి ఉందన్నారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వేసవికాలంలో అడవులకు నిప్పు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పర్యావరణ మిత్రలను అధికారులు సన్మానించారు. ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో నారాయణ, పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర, అటవీశాఖ సిబ్బంది, పలమనేరు పరిరక్షణ సమితి, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న అటవీ అధికారులు

అంగన్‌వాడీలకు శిక్షణ





సదుం: మాట్లాడుతున్న డాక్టర్ గిరీష, చౌడేపల్లె: అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న ప్రతిభా పరీక్షలు

పెద్దపంజాణి: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో రెండో రోజైన శుక్రవారం పలమనేరు సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల, సమతుల్య ఆహారం, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాలలో తీసుకోవాల్సిన చర్యల గురించి శిక్షణ ఇచ్చారు. మూడేళ్లలోపు పిల్లలకు నవచేతన, 3–6 ఏళ్ల పిల్లలకు ఆదర్శాల కార్యక్రమాలతో బోధన చేయడం గురించి వివరించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారద, లత పాల్గొన్నారు.

ఆరోగ్యవంత జీవనానికి సమష్టి కృషి

సదుం: చిన్నారుల ఆరోగ్యవంత జీవనానికి సమష్టిగా కృషి చేయాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీష అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ బీ–పడాయి బీ శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. చిన్నారులు, గర్భవతులలో పోషకాహారం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, నీలకంఠ, శిఖామణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రతిభా పరీక్షలు

చౌడేపల్లె: అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇస్తున్న శిక్షణలో భాగంగా రెండో రోజు శుక్రవారం వివిధ అంశాలను సమగ్రంగా వివరించినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన తెలిపారు. పోషణ్ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతులు, సూక్ష్మ పోషక లోపాలను గుర్తించి మెరుగు పరడమే ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కార్యకర్తలను గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతిభ సామర్థ్యపు పరీక్షలు నిర్వహించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణ సమీపంలోని రాంపల్లె వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను సీడీపీఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్ అయేషా నస్రీన్‌తాజ్ ప్రారంభించి మాట్లాడారు. సూపర్‌వైజర్లు ఫ్యామిద, సుగుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి, రాహుకాల సమయంలో సాంప్రదాయబద్ధంగా పూజార్చనలు చేసిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

కవిత్వం సమాజాన్ని ప్రతిబింబించాలి

పలమనేరు: కవిత్వం సమాజాన్ని ప్రతిబింబించాలని ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని సమస్యలను రచయితలు, కవులు తమ రచనల్లో ఎత్తిచూపాలన్నారు. అలాగే ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాష అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరమూ ఉందన్నారు. కార్యక్రమంలో తులసీనాథం నాయుడు, మాధవరెడ్డి, చంద్రశేఖరయ్య, పలమనేరు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఉలవల పంపిణీపై విచారణ



పులిచెర్లలో రైతులను విచారణ చేస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలో సబ్సిడీపై పంపిణీ చేసిన ఉలవలు రైతులకు అందాయా, లేదా? అని శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులు విచారణ చేశారు. 2024 ఖరీఫ్‌కు 90 క్వింటాళ్ల ఉలవలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఉలవలను 80శాతం సబ్సిడీపై రైతులకు ఇచ్చారా? సబ్సిడీపై 10 కిలోల ఉలవలు పొందిన రైతులు వాటిని సాగు చేశారా, దిగుబడి ఎంత వచ్చింది? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విచారణాధికారులుగా పీలేరు ఏడీఏ రమణరావు, ఏఓ రమణారెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి హరిప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.